TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 209 | సోమవారం 18 నవంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840067131 | online E-paper



## అధికార లాంఛనాలతో రామ్మూర్తి నాయుడి అంత్యక్రియలు

**తిరుపతి:** ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడి అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆయన స్వగ్రామం తిరుపతి జిల్లా నారావారిపల్లెలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, రామ్మూర్తినాయుడి తనయుడు, సినీనటుడు నారా రోహిత్ ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తల్లిదండ్రుల అంతిమ సంస్కారాలు నిర్వహించిన చోటే రామ్మూర్తి నాయుడి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు పలువురు ప్రముఖులు రామ్మూర్తినాయుడి పార్థివదేహానికి నివాళులర్పించారు. సినీనటుడు మోహన్‌బాబు, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు నివాళులర్పించారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రామ్మూర్తి నాయుడు కన్ను మూసిన సంగతి తెలిసిందే.

## నటి కస్తూరికి 29 వరకు కోర్టు రిమాండ్...



**టి నగర్ న్యూస్ :** 3వ తేదీన చెన్నైలో బ్రాహ్మణ సంఘం తరపున జరిగిన నిరసన కార్యక్రమంలో నటి కస్తూరి చేసిన ప్రసంగం ప్రజల్లో తీవ్ర దుమారం రేపింది. ఆ కార్యక్రమంలో తెలుగువారి పరువు తీశారని ఆరోపించారు. ఆ తర్వాత తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అయితే నటి కస్తూరిపై చెన్నైతో పాటు పలు చోట్ల ఫిర్యాదులు అందాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం మదురై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ కొట్టివేస్తూ 14న ఉత్తర్వులు జారీ చేశారు. నటి కస్తూరి ముందస్తు బెయిల్‌ను తిరస్కరించడంతో ఆమె అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆమెని అరెస్ట్ చేసేందుకు పోలీసులు సీరియస్‌గా చర్యలు తీసుకున్నారు. ఆమెని పట్టుకునేందుకు ప్రత్యేక బలగాలను కూడా ఏర్పాటు చేశారు. తమిళనాడు, ఆంధ్రా, తెలంగాణ సహా పొరుగు రాష్ట్రాలలో కూడా పోలీసులు ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణాలోని హైదరాబాద్ సమీపంలోని పప్పలకుడ ప్రాంతంలోని సినీ నిర్మాత హరికృష్ణన్ బంగ్లాలో నటి కస్తూరి దాక్కున్నట్లు చెన్నై స్పెషల్ పోలీస్ ఫోర్స్ నిన్న కనుగొంది. దీంతో ప్రత్యేక పోలీసులు అక్కడికి వెళ్లి నటి కస్తూరిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో అరెస్ట్ అయిన నటి కస్తూరిని పోలీసులు ఈరోజు చెన్నైకి తీసుకొచ్చారు.




ఆందోళన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

**అమరావతి:** ఇప్పట్లో డీఎస్సీ నిర్వహణపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటన అభ్యర్థుల్లో మరింత గందరగోళం నింపింది. కొన్నేళ్లుగా డీఎస్సీ అభ్యర్థులు ఒక్కొక్కరు రూ.50 వేలు చొప్పున ఖర్చు చేసి, మరీ కోచింగ్ తీసుకున్నారు. మరికొందరు ఇప్పటికీ కోచింగ్ సెంటర్‌లలో ఉన్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డీఎస్సీ నిర్వహణపై చేసిన ప్రకటన విద్యార్థుల్లో అయోమయాన్ని సృష్టిస్తోంది. వచ్చే ఏడాది అని ఆయన అంటున్నప్పటికీ.. కోర్టు వ్యవహారం కావడంతో ఇప్పట్లో నిర్వహణ సాధ్యం కాదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

**ఎన్నికలకు ముందు హామీ..** తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. దీంతో నిరుద్యోగులు కూటమికి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని మెగా డీఎస్సీ ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వం 6,900 టీచర్ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను కూటమి సర్కార్ రద్దు చేసిన విషయం విదితమే. ఈ పోస్టులను కూడా మెగా డీఎస్సీలో కలిపింది. వైసీపీ ప్రభుత్వం చివరి రోజుల్లో డీఎస్సీ ప్రకటన ఇచ్చింది గానీ.. నిర్వహించలేకపోయింది. దీంతో నిరుద్యోగుల ఆగ్రహానికి గురి కావల్సి వచ్చింది.

**ఎదురుచూస్తున్న నిరుద్యోగులు :** డీఎస్సీ నోటిఫికేషన్ కోసం దాదాపు 7.50 లక్షల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఏడాదిగా కోచింగ్ తీసుకుంటూ వేలాది రూపాయల్ని ఖర్చు చేసుకుంటున్నారు. కొందరు మహిళలు చిన్న పిల్లల్ని సైతం ఇళ్ల వద్ద విడిచి కోచింగ్ తీసుకుంటున్నారు. ఇదిగో.. అదిగో అంటూ కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఊరిస్తూ వచ్చింది. తాజాగా డీఎస్సీ నోటీఫికేషన్‌పై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. కొన్ని న్యాయపరమైన సమస్య లున్నాయని, వాటిపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించినట్లు లోకేశ్ చెప్పారు. న్యాయపరమైన చిక్కులపై లోతుగా అధ్యయనం చేయాలని అధికారులు చెబుతున్నారు. దీంతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇప్పట్లో వచ్చేలా లేదని నిరుద్యోగులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురి అవుతున్నారు. మరీ ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో రిజర్వేషన్‌లో మార్పు చేయాల్సి వస్తోందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆరేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్లు లేవు. దీంతో వయసు పైబడుతూ, ఉద్యోగాలకు అర్హత కోల్పోతామనే ఆందోళన అభ్యర్థుల్లో ఆందోళన నెలకుంది. మొత్తానికి డీఎస్సీ ఇప్పట్లో జరుగు తుందనే నమ్మకం అభ్యర్థుల్లో నెమ్మదిగా సడలుతోంది.

## రాష్ట్ర నికర అప్పు రూ.6.46 లక్షల కోట్లు మాత్రమే

**హైదరాబాద్:** ఎన్నికల మందు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తూ, రూ.14 లక్షల కోట్ల అప్పులు చేశామని దుష్ప్రచారం చేసిన టీడీపీ కూటమి, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక, అది నిజమని చూపేందుకు విశ్వప్రయత్నం చేస్తోందని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. అందుకే రాష్ట్ర అప్పులపై వాస్తవాలన్నీ బడ్జెట్ ప్రతుల్లో ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వ నికర అప్పు రూ.6.46 లక్షల కోట్లు అని స్పష్టంగా పేర్కొన్నా.. ఏవేవో లెక్కలు కట్టి, ఇప్పుడు దాన్ని రూ.9.74 లక్షల కోట్లుగా చూపుతూ, తవ్వేకొద్దీ ఇంకా ఎంత బయట పడుతుందో! అంటూ చెబుతున్నారని ఆయన ఆక్షేపించారు. తవ్వడానికి ఇదేమీ సొరంగమో, గనినో కాదన్న ఆయన, నిజానికి కాగ్ ప్రతినెలా ఆడిట్ చేస్తుందని, అన్ని వాస్తవాలు అందులో బయట పడతాయని చెప్పారు. 'నిద్ర పోతున్న వారిని మేల్కొలపవచ్చు. కానీ, నిద్ర పోతున్నట్లు నటిస్తున్న వారిని మేల్కొలపలేం' అన్న, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తోందని, అన్ని వాస్తవాలు తెలిసినా,



అన్నింటికి గత మా ప్రభుత్వాన్నే నిందిస్తూ, విమర్శలు చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో మీడియాతో సుదీర్ఘంగా మాట్లాడిన మాజీ ఆర్థిక మంత్రి రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని వివరించారు. ఇంకా ఈ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగడుతూ.. గణాంకాలతో సహా, అన్నీ వివరించారు. అందుకే ఎవరు గుంజీలు తీయాలో ఆలోచించుకోవాలని ప్రభుత్వానికి చురకలంటించారు. హైదరాబాద్, ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడారు

## సూపర్ సిక్స్ కాదు.. సూపర్ బాదుడు

**తణుకు:** ఏపీ సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసి సూపర్ బాదుడు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. ఒకపక్క పెరిగిన పేదలు గగ్గోలు పెడుతుంటే చంద్రబాబు మాత్రం నిర్మల సీతారామన్‌ను ఒక పర్సెంట్ జీఎస్టీ పెంచుకోవటానికి అనుమతి అడుగుతున్నారుని అన్నారు. మాజీ మంత్రి కారుమూరి ఆదివారం తణుకు వైయస్ఆర్‌సీపీ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తాం పేదవారిని లక్షాధికారిని చేస్తామని చంద్రబాబు అబద్దాలు చెప్పాడు. ఆనాడు బాదుడే బాదుడు అని తిరిగిన చంద్రబాబు ఇప్పుడు చేస్తున్నదేంటి?. సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు గాలికి వదిలేశారు.. ప్రజలకు సూపర్ బాదుడు అమలు చేస్తున్నారు.

నాణ్యమైన కరెంట్ ఇస్తామని కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి సూపర్ బాదుడు బాదుతున్నారు. ఆనాడు లోకేష్ రైతులను ఉద్దేశించి స్మార్ట్ మీటర్లు ఎవరూ పెట్టుకోవద్దని, అవి బిగిస్తే బద్దలు కొట్టాలని చెప్పాడు. ఇప్పుడు కేంద్రంతో కుమ్మక్కై స్మార్టుగా స్మార్ట్ మీటర్లు బిగించేస్తున్నారు. ఇది రైతులను మోసం చేసినట్లు కాదా?. వందల కోట్లు చందాలు వసూలు చేసి అగ్గిపెట్టె, కొవ్వొత్తులకి అయిపోయాయని మోసం చేశారు.




అన్ని నిత్యవసర ధరలను ఇష్టానుసారం పెంచేశారు.

ఒక్కసారి గమనిస్తే నూనె దగ్గర నుండి పప్పులు, ఉప్పులు, కూరగాయలు అన్నీ కూడా దారుణంగా పెంచేశారు. ఇప్పటికీ వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న ధరలను ప్రజలకు ఒక్కసారి గమనించుకోండి. ఒక పక్క పేద ప్రజలు గగ్గోలు పెడుతుంటే చంద్రబాబు మాత్రం ఒక పర్సెంట్ జీఎస్టీ పెంచుకోవడానికి ఆర్థిక మంత్రిని అనుమతి అడుగుతున్నారు. అన్నీ అబద్దాలు చెప్పి ప్రజలను మోసం చేసి వచ్చారు కూటమి నేతలు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పే మీరు ఎక్కడ సంపద సృష్టించారు. ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై నిందలు మోపారు. అసెంబ్లీ సాక్షిగా అన్ని నిజాలు బయటకు వస్తున్నాయి. మరి ఇప్పుడేం సమాధానం చెబుతారు' అని ప్రశ్నించారు.

కూటమి సర్కార్ కక్ష సాధింపు..
కొడాలి నానిపై కేసు 2లో

200కి పైగా గెలుపొందాలనే
లక్ష్యం : స్టాలిన్ 3లో

# రీచార్జి విధానంలోకి ఏపీ ఈపీ డీసీఎల్

**అమరావతి** : రానున్న రోజుల్లో విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీపెయిడ్ విధానంలోకి మారనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానే స్మార్ట్ మీటర్లు రానున్నాయి. మొదట మాన్యువల్ మీటర్ల నుంచి ప్రారంభమైన విద్యుత్ మీటర్లు ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా మారుతూ వచ్చాయి. ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల వంతు వచ్చింది. ప్రీపెయిడ్ ఆప్షన్‌తో ఈ మీటర్లు రూపొందించారు. సాధారణంగా ఈ నెల వినియోగించిన విద్యుత్ బిల్లును వినియోగదారులు మరుసటి నెల చెల్లిస్తున్నారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎటువంటి అపరాధ రుసుం చెల్లించవలసిన అవసరం లేదు. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి దాదాపు నెల వరకు సమయం ఉంటుంది.

ఇప్పటి వరకు అనుసరిస్తున్న పద్ధతి ఇదే. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మీటర్లలో ప్రీపెయిడ్ ఆప్షన్ జతచేశారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా కోసం ముందుగానే రీచార్జి చేయాల్సి ఉంటుంది. అలా చేయక పోతే సరఫరా ఆటోమేటిక్‌గా ఆగిపోతుంది.

**విద్యుత్ మీటర్లలో మార్పులు** : మొదట మెకానికల్ (మాన్యూవల్) మీటర్లు ఉండేవి వాటిలో యూనిట్లు చూసి రీడర్లు బుక్‌లో రీడింగ్ రాసుకునేవారు. తర్వాత ఎలెక్ట్రో మెకానికల్ మీటర్లు, హై యాక్యురసీ మీటర్లు వచ్చాయి. ఆ తరువాత ఐఆర్ పోర్ట్ అంటే స్కాన్ చేస్తే రీడింగ్ ఆటోమేటిక్ రికార్డు అవుతుంది. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు వస్తున్నాయి. ఇవన్నీ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా రూపొందించినవే. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటు పడిన వినియోగదారులకు స్మార్ట్ మీటర్‌పై మరింత అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

**జీతాలకు కోట్లు** : విద్యుత్ శాఖ పరిధిలో వేల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతి నెలా విద్యుత్ శాఖ జీతాలు, పింఛన్లు చెల్లించడానికి రూ.కోట్లు కావాల్సి వస్తోంది. ఇక శాఖాపరంగా అభివృద్ధి కోసం వందల కోట్లు కావాల్సి వస్తోంది. వీటికి మూలాధారం విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చే ఆదాయమే. జిల్లాలో నెలకు సుమారు రూ.50



కోట్లకు పైగా విద్యుత్ బిల్లుల రూపంలో ఆదాయం వస్తోంది. అదే స్మార్ట్ మీటర్లు పెడితే ఇంకా పెరుగుతుందని అంచనా.

**ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లు** : జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖలు, పంచాయతీలు, పరిశ్రమలు, వ్యాపార, గృహావస రాలు కలిపి మొత్తం 6,12,317 సర్వీసులు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాల పరంగా ఇప్పటి వరకు రూ.103 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. ఆ బకాయిల చెల్లింపుల కోసం ఎన్ని నోటీసులు ఇచ్చినా వసూళ్లు మాత్రం అంతంత మాత్రమేనని ఆ శాఖ రెవెన్యూ అధికారులు చెపుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలే కదా విద్యుత్ సరఫరా కట్ చేయరనే భావన ఏర్పడడంతో అవి మొండి బకాయిలుగా మారాయి. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రీపెయిడ్ విధానం అమలులోకి వస్తే విద్యుత్ శాఖకు బకాయిల బాధ ఉండదు.

**ఉపయోగాలు..**

- సెల్ ఫోన్లో బ్యాలెన్స్ ఏ విధంగా చూసుకుంటామో.. ఇక్కడ అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.
- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా ఉంటుంది. నగదు అయిపోయిన వెంటనే సరఫరా బంద్ అవుతుంది. రీచార్జి చేస్తేనే విద్యుత్ వెలుగులుంటాయి.
- బ్యాలెన్స్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చు.

# విశాఖకు మోదీ?

**అమరావతి:** ఈ నెల 29న ప్రధానమంత్రి మోదీ రాష్ట్రంలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. విశాఖ కేంద్రంగా భారీ పెట్టుబడుల పార్క్ ఏర్పాటుకు ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన చేయబోతు న్నట్లు సమాచారం. ఈ పార్క్ ఏర్పాటుతో ఆంధ్ర ప్రదేశ్‌కు 80 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని అంచనా. విశాఖలో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా జరగబోతోందని అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌తో పాటు గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ల ఏర్పాటుకు భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. ఈ మూడు ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 1200 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ ప్రాజెక్టుల కారణంగా వచ్చే నాలుగేళ్లలో 48 వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

**84,700 కోట్ల పెట్టుబడులు** : విశాఖలోని పూడిమడకలో ఎన్టీపీసీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. మూడు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయనున్నారు. 84,700 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. గ్రీన్ హైడ్రోజన్ మాన్యుఫాక్చరింగ్ జోన్లు వస్తాయని... విండ్, సోలార్ హైబ్రిడ్ పంప్డ్ స్టోరేజీకి కావాల్సిన 20 గిగా వాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయొచ్చని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టులో ఏపీ జెన్‌కోకు 50 శాతం భాగస్వామ్యం ఉంది. సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుతో రూ.65వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు



రిలయన్స్ సంస్థతో చేసుకున్న ఒప్పందం గురించి కూడా చంద్రబాబు వివరించారు. వీటితోపాటు విశాఖలో టాటా గ్రూప్ పెట్టుబడులు పెట్టబోతోందన్నారు. అక్కడ ఐటీ ప్రొఫెషనల్స్ తయారు చేస్తుందని వెల్లడించారు. ఎల్‌జీ సంస్థ కూడా పెట్టుబడులకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. 2014-19 మధ్య 227 ఎంవోయూలు జరిగినా వైసీపీ ప్రభుత్వం చర్యల కారణంగా వాళ్లు పెట్టుబడులు పెట్టలేదన్నారు.

**కూటమి ప్రభుత్వంలో తొలిసారిగా పర్యటన**

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ప్రధానమంత్రి రానున్న సందర్భంగా ఘనమైన ఏర్పాట్లు చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపన కూడా మోదీ చేతుల మీదుగా చేయాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. శుక్రవారం ఢిల్లీ వెళ్తున్న చంద్రబాబు ఈ విషయంపై స్పష్టత తీసుకోనున్నారు. ఇప్పటికే రైల్వే జోన్‌కు కావాల్సిన భూమిని కూడా రైల్వే శాఖకు ప్రభుత్వం అప్పగించింది. శంకుస్థాపన ప్రక్రియ పూర్తి అయితే పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు.

# నటి కస్తూరి అరెస్ట్

**కె.జగదీష్ రెడ్డి స్టాలిన్‌కు కృతజ్ఞతలు**



**విల్లివాకం న్యూస్:** తమిళనాడు తెలుగు యువశక్తి సంస్థ అధ్యక్షుడు, సినీ నిర్మాత కె.జగదీష్ రెడ్డి ఒక ప్రకటనలో ఇలా తెలిపారు. వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం వార్తల్లో నిలిచే నటి కస్తూరి ఇప్పుడు తెలుగు వారిపై విపరీతమైన వ్యాఖ్యలు చేయడంతో ఆమెకు పిచ్చి పట్టిందన్న అనుమానాలు కలుగుతున్నాయి. కస్తూరిపై చర్యలు తీసుకోవాలని తమిళనాడు పోలీస్ డీజీపీకి ఫిర్యాదు చేశాను. ఆ తర్వాత తమిళనాడుముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆదేశాల మేరకు తమిళనాడు పోలీసులు చర్యలు తీసుకుని నటి కస్తూరిని అరెస్ట్ చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌కు తమిళనాడు తెలుగు యువశక్తి సంస్థ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

# కవి సోమన్నకు కర్నూలు గ్రంథాలయంలో సన్మానం

పెద్దకడబూరు మండల పరిధిలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితో పాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాల సాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్నను గ్రంథాలయ వారోత్సవాలు మరియు కవి సమ్మేళనం సందర్భంగా విచ్చేసిన కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ ఇంచార్జి ఉపకులపతి శ్రీ డా.యన్.టి.కె.నాయక్,తెలుగు భాష వికాస ఉద్యమం అధ్యక్షులు శ్రీ జె.యస్.ఆర్.కె.శర్మ ,కార్యదర్శి శ్రీ కె.ప్రకాష్ ,గ్రంథాలయ అధికారిణి శ్రీమతి వి.పెద్దక్క మొదలగు వారు కర్నూలు గ్రంథాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వీరు రచించిన "చిరు మువ్వలు" పుస్తకాన్ని కవులు,పాఠకులు,పాత్రికేయ మిత్రుల





సమక్షంలో పరిచయం చేయడం జరిగింది. అదేకాకుండా సోమన్న రచించిన యావై పుస్తకాలు గ్రంథాలయానికి ఉచితంగా అందజేశారు. అనతి కాల వ్యవధిలో 58పుస్తకాలు వ్రాసి ముద్రించిన శ్రీ గద్వాల సోమన్న గారి విశేష కృషిని ప్రశంసించి, సత్కరించటం విశేషం.ఈ కార్యక్రమంలో కవులు సుబ్బలక్ష్మమ్మ, ఇనాయతుల్లా, అవుల బసప్ప, స్వరూప సిన్హా మరియు జహీర్ మున్నగువారు పాల్గొన్నారు.

# కూటమి సర్కార్ కక్ష సాధింపు.. కొడాలి నానిపై కేసు

**విశాఖపట్నం:** ఏపీలో కూటమి నేతల ఆగడాలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా కూటమి నేతలు, పోలీసులు ముందుకు సాగుతున్నారు. నిన్నటి వరకు సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులు కొనసాగగా.. ఇప్పుడు రాజకీయ నాయకులపై వేధింపులు మొదలయ్యాయి. మాజీ మంత్రి కొడాలి నానిపై లా విద్యార్థినితో కూటమి నేతలు ఫిర్యాదు చేయించారు. కూటమి నేతలు మాత్రమే కాకుండా విద్యార్థులను కూడా రాజకీయ కక్షలకు పావులుగా వాడుకుంటున్నారు. లా విద్యార్థిని ప్రియతో కూటమి నేతలు.. కొడాలి నానిపై త్రీటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేయించారు. చంద్రబాబుపై కొడాలి నాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీంతో, పోలీసులు నానిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

# సోషల్ మీడియా కార్యకర్తలపై కొనసాగుతున్న కక్ష సాధింపు కేసులు

**అమరావతి:** సోషల్ మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వ కక్ష సాధింపు కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంటూరి రవి కిరణ్ పై బాపట్ల జిల్లా ఇంకోలు పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. విశాఖ సెంట్రల్ జైల్ నుంచి బాపట్లకు ఇంటూరిని తరలించారు. ఇప్పటివరకు ఇంటూరిపై 14 కేసులు నమోదు చేశారు. విశాఖ సెంట్రల్ జైల్‌లో ఉన్న మరో సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఖాజా బాబాపై రామచంద్రపురం పీఎస్‌లో అక్రమ కేసు బనాయించారు.

ఫేక్ ఐడీలతో బోగస్ ప్రచారం టీడీపీకి అలవాటే అని వైయస్‌ఆర్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ అన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీంద్ర రెడ్డి పేరుమీద ఫేక్ అకౌంట్లతో పోస్టులు పెట్టారని మండిపడ్డారు. ఫేక్ ఐడీలతో బోగస్ ప్రచారం చేయడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వైయస్ జగన్ తన తల్లిని, చెల్లిని కూడా అమ్మా అనే మాటతో సంబోధిస్తారు. అది మహిళలకు ఆయనిచ్చే గౌరవమని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన కాసు మహేష్ రెడ్డికి అనుచరుడు, గురజాల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సురేష్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సురేష్ రెడ్డిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.



# 200కి పైగా గెలుపొందాలనే లక్ష్యం : స్టాలిన్



**విల్లివాకం న్యూస్:** ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఒక ప్రకటనలో ఇలా తెలిపారు. ప్రతి జిల్లాలో క్షేత్రస్థాయి సర్వే చేస్తామని నామక్కల్‌లో ప్రకటించిన మీలో నేనూ ఒకడిని, కోయంబత్తూరు, విరుదునగర్ జిల్లాల్లో ప్రత్యక్ష సర్వే నిర్వహించి గత 14, 15 తేదీల్లో అరియలూరు-పెరంబలూరు జిల్లాల్లో నేరుగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాను. రెండు జిల్లాల ప్రజలకు ప్రణాళికలు అందించాను. మరియు పార్టీ యొక్క సోదరులు మరియు సోదరీమణులతో సంప్రదింపులు నిర్వహించడం నాకు చాలా సంతృప్తినిచ్చింది. నేటి రాజకీయ క్షేత్రంలో 'రోడ్ షో' అని వారు అంటున్నారు షో అంటే ప్రదర్శన. ఇది కేవలం ప్రదర్శన మాత్రమే కాదు. ద్రవిడ పాలనా నమూనాకు భారీ స్వాగతం. డీఎంకే ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్న ప్రజల పండుగ, వేడుక. జయంగొండం నుంచి అరియలూరు వరకు జనం పోటెత్తారు. మీలో ఒకరైన నన్ను చూసి ప్రజలు ఆనందంతో చప్పట్లు కొట్టారు, 234 నియోజక వర్గాల్లో 200కి పైగా గెలుపొందాలనే లక్ష్యంతో 200కు పైగా గెలవాలని పట్టుబట్టారు.

# ముదుమలైలో పర్యాటకుల సందడి



**విల్లివాకం న్యూస్:** తెప్పక్కడు ఏనుగుల శిబిరం నీలగిరి జిల్లాలోని ఊటీ సమీపంలోని ముదుమలైలో ఉంది. ఇక్కడ 28 ఏనుగులు ఉన్నందున, ఇక్కడ ఏనుగులకు ఉదయం మరియు సాయంత్రం రెండు పూటలా పౌష్టికాహారం అందించడం ఆనవాయితీ. ఏనుగుల ఊరేగింపు మరియు తినుబండారాలు చూసేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వారాంతాన్ని దృష్టిలో ఉంచుకుని ఆదివారం ముదుమలై తెప్పక్కడు ఏనుగుల శిబిరానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. అక్కడ, పర్యాటకులు గుమిగూడి, ప్రతి ఏనుగుకు దాని సంరక్షకుడు ఆహారం ఇవ్వడం మరియు ఏనుగుల చేష్టలను ఉత్సాహంగా చూశారు.



మీంజూర్ మున్సిపాలిటీలోని తిరువళ్లూరు జిల్లా పొన్నేరి అసెంబ్లీ నియోజకవర్గం తేరడి వీధి పుదుపేడు అరియన్ వాయల్ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిబిరం జరిగింది, ఇందులో పొన్నేరి ఎదుట శాసనసభ సభ్యుడు అన్నాడీఎంకే ఉత్తర జిల్లా లీగ్ కార్యదర్శి సిరునియం బలరామన్ హాజరయ్యారు. వీక్షించారు. ఓటర్ల జాబితాలోఎనిమిది పోలింగ్ బూత్‌లలో 18 ఏళ్లు పైబడిన వారందరినీ ఓటర్లుగా చేర్చాలని, చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని నల్లూరు కోరారు. యూనియన్ కార్యదర్శి ముత్తుకుమార్ నగర కార్యదర్శి పట్టబ్రామన్ డిప్యూటీ సెక్రటరీ తమిళరసన్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడు లాయర్ మరి మేలూర్ శివలింగం ద్రవిడచ్ సెల్వన్‌తో పాటు పలువురు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

-పొన్నేరి న్యూస్





# ఘనంగా సిటిఏ కార్తీక వనభోజనాలు

**విల్లివాకం న్యూస్:** చెన్నై తెలుగు అసోసియేషన్ ప్రతి సంవత్సరం జరుపుకున్నట్లుగా ఈ సంవత్సరం కూడా కార్తీక వనభోజనాలు జరుపుకున్నారు. సిటిఏ సభ్యులు ఇతర తెలుగువారు దాదాపు 340 మంది హాజరైన ఈ వనభోజనాల కార్యక్రమం చెన్నై, పూందమల్లి సమీపంలోని క్వాలిటీ ఫార్మ్ లో అపూర్వకంగా జరిగాయి. పిల్లలకు, స్త్రీలకు, పురుషులకు, దంపతులకు వేరువేరుగా జరిగిన ఆటల పోటీలలో సభ్యులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో గెలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. స్వచ్ఛమైన తెలుగు వంటకాలతో మధ్యాహ్నం భోజనం మరియు సాయంత్రం అల్పాహారాలతో అతిథులందరూ తృప్తిగా సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. ఈ కార్యక్రమంలో సిటిఏ అధ్యక్షులు కే గోపాలకృష్ణారెడ్డి, కార్యదర్శి సురేష్ గాడిపర్తి, ఉపాధ్యక్షులు బి వెంకయ్య నాయుడు, కోశాధికారి కే నాగరాజు, సంయుక్త కార్యదర్శి ఎం రామయ్య, కమిటీ మెంబర్స్ శ్రీను బాబు, మధుకర్, రామ్ ప్రసాద్, కొండస్వామి నాయుడు, మాజీ కల్చరల్ సెక్రటరీ శ్రీకాంత్, మాజీ కార్యదర్శి పివి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా మల్టీ లింగ్వల్ ఇంటర్నేషనల్ సెమినార్






**విల్లివాకం న్యూస్:** చెన్నై హిందీ ప్రచారక్ సంఘ్, డిఏవి కళాశాల, అజ్మీర్, రాజ్ భవన్ తమిళనాడు కలిసి రెండు రోజులపాటు మల్టీ లింగ్వల్ ఇంటర్నేషనల్ సెమినార్ నిర్వహించారు. దీనికి ప్రొఫెసర్ ఎన్ లక్ష్మి అయ్యర్, డాక్టర్ కేటి మురుగేశన్ మరియు ప్రొఫెసర్ సంజయ్ అరోరా బాధ్యత వహించి దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ ఆఫ్ తమిళనాడు ఆర్.ఎన్ రవి హాజరయ్యారు. భారత దేశంలో ఉన్న ప్రజలందరూ కలిసికట్టుగా ఉండాలని, మనమంతా ఒకే కుటుంబానికి చెందిన వారమని తెలిపారు. కులమతాలు వేరైనా అందరం అన్నదమ్ముల వలె మెలగాలని, ఏ భాషనైనా నేర్చుకోవడం తప్పు లేదని అన్నారు. సుమారు 200 మంది పాల్గొన్న ఈ సభలో రెండు హాల్స్ లోను చాలామంది యోగి వేమన, తిరువళ్ళువర్, కబీర్ దాసు గురించి ఎ కంపారిటివ్ స్టడీ నిర్వహించారు. వీరి మధ్యనున్న భేదాలు, పోలికలు, సమానత్వం, భక్తి, సామరస్యాల గురించి ప్రసంగించారు. ఈ సభలో డాక్టర్ ఏవి శివకుమారి కబీర్ మరియు యోగి వేమన గురించి ప్రసంగించారు. ముగింపు సభలో అందరికీ ప్రశంస పత్రాలను అందజేశారు.

వేలూరు నారాయణి పాఠశాల పవిత్ర చెస్ అకాడమీ ఆధ్వర్యంలో బంగారు గుడి పీఠాధిపతి శక్తి అమ్మ జన్మదిన పురస్కరించుకొని జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు ఈ పోటీలను బంగారు గుడి డైరెక్టర్ సురేష్ బాబు ప్రారంభించారు వీటిలో శ్రీ నారాయణ ఆసుపత్రి డైరెక్టర్ బాలాజీ వేలూరు చెస్ అసోసియేషన్ ఆర్గనైజర్ రవి రాష్ట్ర ఉపాధ్యక్షులు మణికంఠ స్వామి కోశాధికారి మనోహరం తదితరులు పాల్గొన్నారు **-వేలూరు**



# శబరిమల వెళ్లే భక్తులకు హెల్త్ టిప్స్.. కీలక సూచనలు



**తెలుగు న్యూస్ టైమ్స్** : మండల-మకరవిళక్కు సీజనులో భాగంగా కేరళలోని శబరిమల ఆలయం తెరుచుకుంది. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో శబరిమల అయ్యప్ప ఆలయానికి వెళ్లే భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ఆలయానికి చేరుకొనే అన్ని ప్రధాన మార్గాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు కేరళ ఆరోగ్యశాఖ తెలిపింది. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భారీగా సంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో పంబాలో పలు భాషలు మాట్లాడే వైద్యులు, వాలంటీర్లతో 24/7 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. యాత్ర సమయంలో భక్తులు గుర్తుంచుకోవాల్సిన కొన్ని కీలక సూచనలివే..

- శబరి గిరులపై కొలువైన అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకొనే సమయంలో యాత్రికులకు ఒంట్లో నలతగా అనిపిస్తే.. భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రం నుంచి వైద్య సాయం తీసుకోవడంలో ఏమాత్రం ఆలస్యం చేయొద్దు.
- రెగ్యులర్‌గా వాడే మందులను తీర్థయాత్ర సమయంలో మానేయొద్దు. ఇప్పటికే మీరు ఏదైనా అనారోగ్యానికి చికిత్స పొందుతున్నట్లయితే.. యాత్ర సమయంలోనూ సంబంధిత ఔషధాలు, ప్రిస్క్రిప్షన్‌లను మీ వెంట ఉంచుకోండి.
- అయ్యప్ప ఆలయం వద్దకు ఒకేసారి నడిచి వెళ్లడం అసౌకర్యంగా అనిపించవచ్చు. అందువల్ల తీర్థయాత్రకు వెళ్లడానికి ముందే నడక, కొన్ని వ్యాయామాలు ప్రాక్టీసు చేయడం ఉత్తమం.
- అంతగా ఫిట్‌నెస్ లేనివారు కొండపైకి నెమ్మదిగా ఎక్కడం ఉత్తమం. అవసరమైన చోట ఆగి విశ్రాంతి తీసుకోండి. నీలిమల మార్గాన్ని ఎంచుకోవద్దు. స్వామి అయ్యప్పన్ రహదారిని ఎంచుకోండి. భోజనం చేసిన వెంటనే కొండపైకి ఎక్కడం చేయొద్దు.
- ఏదైనా వైద్య సాయం కావాలంటే.. 04735203232 నంబర్‌కు కాల్ చేయండి.
- నీలిమల, పంబ, అపచిమేడు, సన్నిధానం ఆస్పత్రుల్లో గుండె సంబంధిత, వైద్య పరీక్షలు వంటి సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.
- పాముకాటుకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించండి. శబరిమలలోని ఆరోగ్య కేంద్రాల్లో యాంటీవీనమ్, చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.
- తీర్థయాత్ర సమయంలో గోరువెచ్చని నీటిని మాత్రమే తాగండి.
- ఆహారం తీసుకొనే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోండి. మూత ఉంచని ఆహారాన్ని తీసుకోవద్దు.
- బహిరంగ ప్రదేశాల్లో విసర్జన చేయొద్దు. టాయిలెట్లను ఉపయోగించండి. ఆ తర్వాత మీ చేతుల్ని సబ్బుతో శుభ్రంగా కడుక్కోండి.



# ఎన్‌టిపిసి అయ్యప్ప దేవాలయంలో పడిపూజ



**జ్యోతి నగర్:** శనివారం రోజు ఎన్‌టిపిసి వైకుంఠపురం హరి హర దేవాలయం ప్రాంగణం లోని శ్రీఅయ్యప్ప స్వామి వారి మండలదీక్ష ప్రారంబం సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిగాయి అని అఖిలభారతీయ అయ్యప్ప ధర్మాప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు . ఆలయ గురు స్వామి, వేద పండితులు బ్రహ్మశ్రీ రాంపల్లి వామనశర్మ గారి చేతుల మీదుగ ఈ ప్రత్యేక పూజలు జరిగాయి అన్నారు. ఉదయం పుణ్య వచనం, గణపతి హెూమం, నవగ్రహ హెూమం, వాస్తు హెూమం, రుద్రాహెూమం, ఘటాభిషేకం, సంప్రోక్షణ మరియు అయ్యప్ప స్వామికి అభిశేఖం చేసినట్లు తెలిపారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ (బిక్ష ) జరిగింది. సాయంత్రం దేవాలయ ప్రాంగనం దీపారదన, కళశపూజ , భక్తి పారావస్యంతో భజన, అయ్యప్ప శరణు గోషతో వైకుంఠ పురం మారుమోగింది అన్నారు. అనంతరం మొదటి పడిపూజ, అల్పాహారం, ప్రసాద వితరణ జరిగింది అని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు. అయ్యప్ప దేవాలయం కమిటీ సభ్యుడు పోలినేని సంపత్ రావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలలో ఈకార్యక్రమంలో , హరి హర దేవాలయ కమిటీ సభ్యులు గిరి కుమార్, టి వి ఆర్ చంద్ర, శేషు కుమార్ గురు స్వామి, చల్లా రవీందర్ రెడ్డి, కృష్ణ,పర్స రామస్వామి, తుమ్మ సురేష్ గురుస్వామి, కొమురవెల్లి రాకేష్ గురుస్వామి, దిక్షిత్ గురుస్వామి, చల్ల మణికంఠ, నవీన్ స్వామి, శ్యామ్ స్వామి మరియు అయ్యప్ప కన్నె స్వాములు, గురు స్వాములు స్వాములు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు




